క్లుప్తంగా

సేదతీర్చిన వర్షం

నాదెండ్ల: రుతుపవనాల ప్రభావంతో బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకూ తీవ్ర ఎండ, ఉక్కబోతతో అల్లాడిన ప్రజలు, సాయంత్రానికి వర్షం పడటంతో సేదతీరారు. కొద్దిరోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడారు. రెండు రోజులుగా రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించటంతో మంగళవారం సాయంత్రం దట్టమైన మబ్బులు అలుముకొని వాన కురిసింది.

మోడల్ స్కూల్లో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ నిమిత్తం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రవినాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ నిమిత్తం దరఖాస్తుల స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 23వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుంది. ఆయా తరగతులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 26న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం వారి రిజర్వేషన్లకు లోబడి, మెరిట్ మార్కులు ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. సీట్లు పరిమితంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొచ్చర్ల సర్పంచ్ కోపెల దేవరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగించుకొని కావాల్సిన పత్రాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోలి వెంకటేశ్వర్లు, కొండ్రముట్ల సర్పంచ్ ఉయ్యాల వెంకటమ్మ, ఉప్పరపాలెం సర్పంచ్ చిందుకూరి కొండమ్మ, కొచ్చర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ అలీషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: సంక్షేమ పథకాలు లబ్ధిదారుల చెంతకు చేరేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సేవలు అందించాలని ఎంపీపీ బత్తిరాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష విధివిధానాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చెందాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని, జగనన్న సురక్ష పథకంలో ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలపై వివరాలు తెలుసుకోవాలన్నారు. సమీక్షలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, విద్యాసంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేటటౌన్: జన్మదినం వంటి శుభకార్యాల్లో నిరుపేదలను భాగస్వాములను చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్ చెప్పారు. ఈ నెల 24 తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అన్నపురెడ్డి శ్రీలక్ష్మి, బేరింగ్ మౌలాలి, నాయకులు యాదాల సుజాత, శ్యాంపాల్, చల్లా శ్రీను, ఖాజావలి, వంశీ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

నాదెండ్ల విద్యార్థులకు బహుమతులు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఏపీ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సమీకృతం, అభివృద్ధి విభాగం అనే అంశంపై ఆలిండియా స్కూల్ క్విజ్ 2023 పోటీలు నిర్వహించారు. మండలస్థాయి పోటీల్లో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున 9, 10 తరగతుల విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి పోటీ నిర్వహించారు. ఈ పోటీలో సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో ఎండుగుంపాలెం, మూడో స్థానంలో కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. ముందుగా వీరికి సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల హెచ్ఎంలతో కలిసి ప్రదానం చేశారు.

చకచకా జగనన్న ఇళ్ల నిర్మాణం

వినుకొండలో పేదల సొంతింటి కల కార్యరూపం దాల్చుతోంది. ఇప్పటి వరకు వారికి అందని ద్రాక్షగా ఉన్న ఇంటి నిర్మాణాన్ని జగనన్న ప్రభుత్వం మరింత చేరువ చేసింది. స్థలాన్ని ఇవ్వడమే కాదు.. దగ్గరుండి మరీ ఇంటి నిర్మాణానికి కావల్సిన వనరులన్నీ సమకూర్చడంతో రెండు వేలకు పైగా ఇళ్లు నేడు తుది దశకు చేరుకున్నాయి. మరికొన్ని బేస్‌మట్టంతో పాటు వేర్వేరు దశలకు చేరుకోవడం విశేషం.

- 120 ఎకరాల్లో 5400 గృహాలు
- ఇప్పటికే పూర్తయిన రెండు వేల ఇళ్లు



పూర్తిగా నిర్మాణమైన ఇల్లు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లతో పాటు ఊర్లకు ఊర్లు నిర్మిస్తున్నారనేందుకు వినుకొండలోని నిర్మాణమవుతున్న జగనన్న కాలనీయే ఒక ఉదాహరణ. రాష్ట్రంలో పెద్దలేఔట్లలో ఒకటైన వినుకొండలో ఏకంగా 5400ల కు పైగా ఇళ్ల నిర్మాణాలు ఒకే చోట 120 ఎకరాల్లో నిర్మాణమవుతున్నాయి. ఒకేచోట ఇన్ని ఇళ్ల నిర్మాణం జరగడమే కాకుండా అందులో విద్యుత్ సబ్‌స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామసచివాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, షాపింగ్‌మాల్స్, క్రీడామైదానం వంటి ఎన్నో అదనపు సౌకర్యాల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ప్రతిపక్షాల విమర్శలకు చెక్

రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఇల్లు కూడా నిర్మాణం కాలేదని ప్రతిపక్షాలు, స్థానిక టీడీపీ నాయకుల విమర్శలకు చెక్ పెడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, గృహనిర్మాణ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించడంతో ఒక్కసారిగా నిర్మాణాలు వేగవంతమయ్యాయి. ఊరికి దూరంగా అడవుల్లో ఇచ్చారు ఇళ్లు ఎలా కట్టుకుంటారని టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలను సైతం పట్టించుకోకుండా ప్రభుత్వం ప్రోత్సాహంతో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.





జగనన్న కాలనీలో వివిధ దశల్లో నిర్మాణమవుతున్న ఇళ్లు

నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల వివరాలు

మంజూరైనవి	4955
బేస్‌మట్టంలో ఉన్నవి	1555
పునాదిలో ఉన్నవి	2586
దర్వాజా లెవల్	95
శ్లాబ్ వరకూ వచ్చినవి	185
బీమ్ లెవల్లో ఉన్నవి	850
పునాదుల వద్ద ఉన్నవి	105
పునాది తీసినవి	183
తుది దశకు చేరుకున్నవి	2 వేలకు పైగా
కట్టుబడి పూర్తయినవి	500లకు పైగానే

సొంతింటి కల నెరవేర్చారు



నా భర్త హుస్సేన్ వృత్తి రీత్యా బేల్దారు మేస్త్రిగా జీవనం సాగిస్తున్నారు. సొంత ఇల్లు లేదు. ముఖ్యమంత్రి జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలం మంజూరు చేశారు. అయితే ఇచ్చిన హామీ ప్రకారం సకాలంలో బిల్లులు మంజూరు కావడంతో మేమే ఇంటి నిర్మాణం చేపట్టాం. సీఎం మా సొంతింటి కల నెరవేర్చారు.

– ఎస్‌కె.సైదాబీ, స్థానికురాలు

లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలి

పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇటీవల ఇంటి నిర్మాణాలు ప్రారంభించే వారికి బేస్మట్టం నిర్మాణానికి రూ.20 వేలు సహాయం చేస్తోంది. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలి. ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలి. ఇళ్ల నిర్మాణం చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లించడం జరుగుతుంది.

–ఎస్. శ్రీనివాస్, హౌసింగ్ డీఈఈ, వినుకొండ

పక్షవాత మహిళ గుండెకు స్టంట్ల అమరిక

- 48 గంటల్లోనే కోలుకున్న వృద్ధురాలు
- ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ అదుపులో ఉంచుకోవాలన్న డాక్టర్లు



స్టంట్‌లు అమర్చగా కోలుకున్న మహిళతో హాస్పిటల్ డాక్టర్లు

నరసరావుపేట: స్థానిక మహాత్మాగాంధీ హాస్పిటల్‌లో 67 ఏళ్ల పక్షవాత మహిళకు కరోటిడ్ స్టంట్ గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాలకు రెండువైపులా ఒకేసారి అమర్చి ఆమె ప్రాణాలు కాపాడిన వైనమిది. బుధవారం హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి వివరాలను వెల్లడించారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు పాములమ్మ కుడివైపు పక్షవాతానికి గురై హాస్పిటల్‌కు రావటం జరిగిందన్నారు. వెంటనే ఆమెకు న్యూరాలజిస్టు డాక్టర్ సూరా ప్రదీప్‌కుమార్ రెడ్డి రక్తం గడ్డ కరిగించే ఇంజక్షన్ చేశారన్నారు. దీంతో ఆవిడ ఆరోగ్యంలో కొంతమెరుగు కన్పించిందని, అయితే ఆమెకు పక్షవాతం ఎందుకొచ్చింది, మళ్లీరాకుండా ఏంచేయాలనే దానిపై ఆమెకు అన్నీ వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. కరోటిడ్ డాప్లర్‌లో మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో రెండువైపులా పూడిక ఉన్నట్లు గుర్తించామన్నారు. కరోటిడ్ యాంజియోగ్రామ్ చేయగా, ఎడమవైపు 80 శాతం పూడిక, కుడివైపు 70 శాతం ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో స్టంట్ అమర్చాలని నిర్ణయించి ఈనెల 19న విజయవంతంగా స్టంట్ అమర్చటం జరిగిందన్నారు. చాలా అరుదైన పరిస్థితుల్లోనే రెండువైపులా స్టంట్ అమర్చుతారన్నారు. రోగి పరిస్థితి మెరుగుకావటంతో ఆమెను 48 గంటల వ్యవధిలోనే డిశ్చార్జి చేయటం జరిగిందన్నారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ అధికంగా ఉన్న ఆమె డాక్టర్లను సంప్రదించకపోవటం వలన ఆమెకు ఈ పరిస్థితి ఎదురైందని, అవి అదుపులో ఉంటే వచ్చే అవకాశమే ఉండదన్నారు. సమావేశంలో రోగి పాములమ్మతో పాటు డాక్టర్ ప్రదీప్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గణపవరంలో జేవీకే కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: గణపవరం అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. హెచ్ఎం ఆలోకం మారుతిరావు అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమానికి స్థానిక చర్చి ఫాస్టర్ చిలకా ప్రభుసింగ్, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి నాడు నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక కిట్లు, ఆంగ్ల, డిజిటల్ విద్యా బోధన, ట్యాబ్‌ల పంపిణీ, మెరుగైన వసతులు కల్పించారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని, ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివేందుకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్య, దాసు, పీఎంసీ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు జయపాల్, అరుణ కుమారి, రజనీకుమారి ఉన్నారు.

9 గంటపాటు శ్రమించి..

విద్యుత్‌ను పునరుద్ధరించిన సిబ్బంది

శావల్యాపురం: స్థానిక శావల్యాపురం సబ్ విద్యుత్ స్టేషను పరిధిలో పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి 1.00 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. కనమర్లపూడి గ్రామసమీపాన పొలాల్లో పిడుగుపాటు దాటికి వినుకొండ సబ్‌స్టేషను నుంచి శావల్యాపురంకు వచ్చే ప్రధాన లైను విద్యుత్ స్తంభాలు రెండు పడిపోయి సమస్యకు కారణమయ్యాయి. దీంతో ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, మండల విద్యుత్ శాఖాధికారి సంపెంగుల గాంధీ సారథ్యంలో 30 మంది విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న బ్రాంచ్ మేనేజరు విశ్వనాథ్

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మండల బ్రాంచ్ శాఖ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఆర్థిక సమీకృతం అభివృద్ధి విభాగంపై అల్ ఇండియా స్కూల్ క్విజ్ పోటీలను మండల స్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజరు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలు మొదటి స్థానం వేల్పూరు హైస్కూలు, రెండవ స్థానం పోట్లూరు, మూడోవ స్థానం శావల్యాపురం విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డుపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటికి యోగా మంచిదే

- మానసిక ఒత్తిడి దూరం
- వెల్లడించిన యోగ శిక్షకులు
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా యోగా డే



రొంపిచర్లలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేట: యాంత్రిక జీవన విధానంలో మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఉపయోగపడుతుందని యోగా శిక్షకులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యోగా సంస్థలు, పలు విద్యాలయాల్లో యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు మాట్లాడుతూ శరీర పోషణకు ఆహారం ఎలా అవసరమో మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం అంతే అవసరమని వివరించారు.

వినుకొండలో..

వినుకొండ (నూజెండ్ల): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి 204ఏ ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్ బజారులో గల వాసవి కార్యాలయంలో వాసవీ జిల్లా గవర్నర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో యోగా డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు అడకా లింగరాజు పాల్గొని సభ్యులచే యోగాసనాలు చేయించారు. వాసవీక్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేటలో..

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని పలు విద్యాసంస్థలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగ శిక్షకుల పర్యవేక్షణలో యోగాసనాలను అభ్యసించారు. జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ జి.పి.రాజు పర్యవేక్షణలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–3 పీఓ రాజనాల వేణుమాధవ్ ఆధ్వర్యంలో వలంటీర్లు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

పలు గ్రామాల్లో ..

నాదెండ్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలు గ్రామాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన యోగా దినోత్సవంలో రామచంద్ర మిషన్, యోగా గురువులు సుధాకర్ రెడ్డి, స్వామి, వెంకటేశ్వర్లు, యోగా క్లాసులు నిర్వహించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ బుధవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవి నాయక్ మాట్లాడుతూ యోగా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంచుతుందన్నారు. అంతే కాకుండా ప్రశాంతతో పాటు మనసు చురుకుగా పనిచేస్తుందన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలోని మూడు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అధికారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. యడ్లపాడు, తుర్లపాడు, సొలస గ్రామాల్లో అమృత్‌సరోవర్ కింద పనులు నిర్వహించిన ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద యోగా డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామం నుంచి చెరువుల వరకు యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెరువు గట్లపై వివిధ యోగాసనాలను వేశారు. కార్యక్రమంలో తుర్లపాడులో సర్పంచ్ రావూరి వేణుగోపాలరావు, కార్యదర్శి సుబ్బారావు, టీఏ సతీష్, ఆర్‌సీఎం స్కూల్ విద్యార్థులు, యడ్లపాడులో సర్పంచ్ కె.హేమ పాల్గొన్నారు.

యోగాతో అనేక సమస్యలకు పరిష్కారం



కోర్టు ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, సిబ్బంది

నరసరావుపేట టౌన్: మానవ జీవితంలో ఎదురయ్యే సామాజిక, మానసిక, భౌతిక సమస్యలకు యోగా ద్వారా పరిష్కారం లభిస్తుందని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితంలో యోగా అత్యంత ప్రాధాన్యత సంచరించుకొందన్నారు. అనంతరం యోగా గురువు లక్ష్మీ యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె. మధుస్వామి, ఆర్. ఆశీర్వాదం పాల్, న్యాయవాద సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.